మంగళవారం 11 జులై 2017

Eenadu

# కృషి, పట్టుదలతో లక్ష్యాన్ని చేరగలం

విద్యార్థులకు రాతపుస్తకాల పంపిణీ

*గురుద్వారా, న్యూస్‌టుడే* : మనిషికి కృషి, పట్టుదల ఉంటే సాధ్యం కానిదంటూ ఏదీ లేదని, ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి నిరంతరం శ్రమించాలని గీతం విశ్వవిద్యాలయం ప్రొ-వీసీ ఆచార్య కె. శివరామకృష్ణ అన్నారు. అక్షయ పాత్ర ఫౌండేషన్, వేదిక్ సైన్స్ క్లబ్ గీతం విశ్వవిద్యాలయం విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం టీపీటీకాలనీ పాఠశాలలో నిర్వహించిన రాత పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మనసులో చేయాలనే తపన ఉంటే అదే మనల్ని విజయం వైపు అడుగులు వేయిస్తుందన్నారు. తమ విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రజల నుంచి పాత పుస్తకాలు సేకరించి వాటిని నూతన రాత పుస్తకాలుగా మార్పిడి చేసి పేద ప్రజలకు సహాయపడే విధంగా చేయడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. మీరు కూడా భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం సంపాదించి పది మందికి సహాయపడాలని సూచించారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ అంబరీష స్వామీజీ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. ఈ స్థాయి నుంచే ఒక లక్ష్యం ఎంచుకుని దాన్ని అధిగమించేందుకు నిరంతరం శ్రమించాలన్నారు. అలా చేసినపుడు సమాజంలో తప్పక గుర్తింపు వస్తుందన్నారు. ప్రముఖుల చేతుల మీదుగా విద్యార్థికి ఐదు పుస్తకాల చొప్పున 750 మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఉప విద్యాశాఖాధికారిణి ఉషారాణి, అక్షయ పాత్ర ప్రతినిధులు వైకుంఠేశ్వర దాస్, ప్రధాన ఉపాధ్యాయుడు రాంప్రసాద్, వేదిక్ సైన్స్ విద్యార్థులు వి.సాగర్, కె. సందీప్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు రాత పుస్తకాలు అందజేస్తున్న ప్రొ-వీసీ శివరామకృష్ణ, ఉషారాణి, తదితరులు